క్లుప్తంగా

29న జాతీయ లోక్‌అదాలత్

తంబళ్లపల్లె: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 29న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ స్థానిక జడ్జి ఉమర్‌ఫరూఖ్ ఓ ప్రకటనలో తెలిపారు. కోర్టులో పెండింగ్ కేసులతో పాటు రాజీ మార్గంకు అనుకూలంగా ఉన్న కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవచ్చునన్నారు. కక్షిదారులు, న్యాయవాదులు పోలీసులను సంప్రదించి కేసులను పరిష్కరించేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కమనీయంగా కల్యాణం



మహాభారతం యజ్ఞంలో ద్రౌపది కల్యాణోత్సవం

రామాపురం : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మహాభారతి యజ్ఞంలో భాగంగా సోమవారం ద్రౌపదిమాత కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ద్రౌపదిమాత తరపున మద్దిరేవుల కుమారి రమేష్‌రెడ్డి దంపతులు, పాండవుల తరపున అయోధ్యపురం సరస్వతి భగవాన్‌రెడ్డి పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. మాజీ శాసనసభ్యుడు గడికోట ద్వారకనాథరెడ్డి పాల్గొని ద్రౌపది మాత కల్యాణోత్సవాన్ని తిలకించి వేద పండితులతో ఆశీర్వాదం పొందారు. మండలంలోని ప్రజలు కల్యాణ ఉత్సవాన్ని తిలకించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కవికి సన్మానం



మురళీధర్‌రాజును సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : తెలుగు భాషాసమితి నిర్వాహకులు, కవి జలకనూరి మురళీధర్‌రాజును ఘనంగా సన్మానించారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి దనాసి ఉషారాణి ఆధ్వర్యంలో 135వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం తిరుపతి ఎస్వీయూ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్‌రాజు జల సంరక్షణ గురించి కంద పద్య గానాన్ని వినిపించారు. దీంతో ఆయనను శాలువ, జ్ఞాపికతో సత్కరించారు.

ఏ పాఠశాలకు సీబీఎస్ఈ గుర్తింపు లేదు

పీలేరు : మండలంలో ఏ ప్రైవేట్ పాఠశాలకు సీబీఎస్ఈ గుర్తింపు లేదని ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కొన్ని పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఓసీ వచ్చినంత మాత్రాన సీబీఎస్ఈ గుర్తింపు ఉన్నట్లు కాదన్నారు. సీబీఎస్ఈ నుంచి ప్రత్యేక గుర్తింపుతో పాటు నంబర్ కేటాయిస్తారని తెలిపారు. అప్పుడే సంపూర్ణ గుర్తింపు పొందినట్లని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎద్దులకు రక్షణ బిల్లలు



ఎద్దుల గిట్టలకు బిల్లలు కొడుతున్న దృశ్యం

గుర్రంకొండ: ఎద్దులకు గిట్టలకు బిల్లలు కొట్టడం వాటికి ఎంతో రక్షణగా ఉంటుంది. ఈ ఏడాది వర్షాలు కురిసి వ్యవసాయ పనులు చురుగ్గా జరగుతుండడంతో రైతులు ఎద్దుల గిట్టలకు బిల్లలు కొట్టిస్తున్నారు. పూర్తిగా యాంత్రీకీకరణ పద్ధతులతో వ్యవసాయ పనులు జరుగుతున్న ఈ రోజుల్లో కూడా ఇలాంటి దృశ్యాలు కనిపించడం చాలా అరుదు. ఎద్దులకు బిల్లలు కొట్టడం వలన వాటి గిట్టలు అరిగిపోకుండా ఉంటాయి. బిల్లులు లేక పోతే గిట్టలు అరిగిపోయి రాళ్లలో, బండలపై నడవడానికి ఎద్దులు ఎంతో ఇబ్బంది పడతాయి. బిల్లలు కొట్టడం వల్ల వ్యవసాయ పనులను చురుగ్గా చేస్తాయనే రైతుల నమ్మకం.

తవ్వారు.. వదిలేశారు



ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో కాలువను తవ్విన దృశ్యం

పీలేరు : స్థానిక ఆర్టీసీ బస్టాండులోనికి వెళ్లే మార్గంలో మురుగునీటి కాలువ తవ్వి వదిలేయడంతో వాహన దారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగునీరు స్తంభించిపోవడంతో నెల రోజుల క్రితం మురుగునీటి కాలువపై కప్పు తొలగించారు. అనంతరం పైకప్పు వేయకుండా వదిలేశారు. దీంతో ఆటోలు, ద్విచక్రవాహనదారులు అందులో ఇరుక్కుపోయి నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రయాణీకులు కూడా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సుండుపల్లెలో..



రామాపురంలో..



రాయచోటిలో..

భక్తిశ్రద్ధలతో బక్రీద్

● ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

రాయచోటి టౌన్ : రాజంపేట క్లస్టర్ పరిధిలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో సోమవారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాయచోటి పట్టణంలోని పాతరాయచోటిలో ఉన్న ఈద్గా ప్రదేశంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణాశాఖ మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

సంబేపల్లె : మండలంలోని సంబేపల్లె, ఎస్.సోమవరం, దేవపట్ల, శెట్టిపల్లె, దుద్యాల, గున్నికుంట్ల, రౌతుకుంట, నారాయణరెడ్డిపల్లె, మొటకట్ల, పీఎస్ కాలనీ, గురిగింజకుంట, నాగిరెడ్డిగారిపల్లె తదితర గ్రామాలలోని ఈద్గాల దగ్గర ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించారు.

సిద్దవటం : మండలంలోని భాకరాపేట, వంతాటిపల్లె, మాచుపల్లె, కనుమలోపల్లె, తురకపల్లి, సిద్దవటం, మాధవరం-1, అలీనగర్, మహబూబ్ నగర్, ఉప్పరపల్లె తదితర గ్రామాల్లోని ఈద్గా, దర్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిద్దవటం ఈద్గా వద్ద మత గురువు పీర్‌బాషా ఖాద్రీ మాట్లాడుతూ త్యాగం, సహనం, మానవత్వానికి ప్రతీక బక్రీద్ అన్నారు. భక్తిభావం, విశ్వాసం, కరుణ, దయ, ఐక్యతకు సంకేతమైనది ఈ పండుగ అన్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా బక్రీద్‌ను ముస్లింలు జరుపుకొన్నారు. ఆయా సమీప ప్రాంతాలలోని గల ఈద్గాలలో పురుషులు సామూహిక ప్రార్థనలు చేశారు. మహిళలు తమ ఇళ్లలోనే ప్రార్థనలు చేశారు.

సుండుపల్లె : మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లాహ్ దీవెనలతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో జీవించి క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలియికే బక్రీద్ విశిష్టత అని మత గురువులు తెలియజేశారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ జమియా మజీద్ ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఈద్ ఉల్ ఫితర్ బక్రీద్ శుభాకాంక్షలను మండల కో–ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్ తెలియజేశారు.

వీరబల్లి : మండలంలోని ముస్లింలు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్ద అల్లాహ్‌ను ప్రార్థించారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం వారు పేదలకు దానధర్మాలు చేశారు.

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని లక్కిరెడ్డిపల్లి, కోనంపేట, మద్దిరేవుల, రెడ్డివారిపల్లి, చింతలకుంట, పందిళ్లపల్లె, దిన్నెపాడు, దూదేకులపల్లెతో పాటు పలు గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్ద నమాజ్ చేసుకున్నారు. లక్కిరెడ్డిపల్లిలోని ఈద్గా వద్ద మత గురువులు ఖ్వాజీ ముక్తార్ మాట్లాడుతూ సమాజహితం కోసం హజరత్ ఇబ్రహీం, ఇస్లాం ప్రవక్తల త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ పండుగ అని తెలిపారు. సమస్త మానవాళి కోసం దైవ ప్రవక్త చేసిన త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ఈదుల్ ఆదా (బక్రీద్) పండుగకు ప్రతి మనిషి ఉన్నంతలో దానధర్మాలు చేయాలన్నారు. ముస్లింలు ఖుర్బానీ దానం చేయడం ద్వారా నిరుపేదలు కూడా పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఆకాంక్ష స్ఫూర్తిదాయకమన్నారు.

ఒంటిమిట్ట : మండలంలోని మండపంపల్లి, ఒంటిమిట్ట, సీతాపురం, నరసన్న గారిపల్లి, మలకాటిపల్లి వద్ద ఉన్న ఈద్గాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒంటిమిట్ట, మలకాటపల్లి మదరసా వద్ద జరిగిన కార్యక్రమాల్లో నూరుల్లా, ఇస్లామిక్ ట్రస్ట్ మదరసా నిర్వాహకులు క్వారీ అబ్దుల్ సుభాన్, కె.అబ్దుల్ రెహమాన్, మౌలి అబూ కాలీఫ్, జామియా మసీద్ ముత్తువల్లి అమానుల్లా, డాక్టర్ జిలాని బాషా, డీలర్ మస్తాన్, సయ్యద్ జాకీర్ హుస్సేన్, మాజీ కో–ఆప్షన్ మెంబర్ షేక్ అజ్మతుల్లా, డాక్టర్ ఖాదర్, ముస్తఫా, చాంద్ బాషా, సత్తార్, తాజుద్దీన్, బాదుల్లా, రంతు, నాఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు, నీలకంఠ్రావుపేట, దూదేకులపల్లి, రామాపురం, కర్ణపువాండ్లపల్లె, చిట్లూరు, పాలన్నగారిపల్లె, ఏకిలపల్లె, హసనాపురం, బండపల్లి తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గాలివీడు : మండల కేంద్రంలోని గుర్రాలమిట్ట వద్ద గల ఈద్గాలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ మానవాళికి గొప్ప సందేశం ఇస్తుందని వారు తెలిపారు.

పుల్లంపేట : మండలంలోని పుల్లంపేట, కాదర్‌పేట, అప్పారాజుపేట, దళవాయిపల్లి తదితర ప్రాంతాలలోని ఈద్గాల వద్ద ముస్లింలు పార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



లక్కిరెడ్డిపల్లిలో సందేశం తెలియజేస్తున్న మత గురువు ముక్తార్



ఒంటిమిట్టలో..



పుల్లంపేట మండలం అప్పారాజుపేటలో..



గాలివీడులో..

త్యాగంతో ప్రశాంత జీవనం

రాజంపేట టౌన్ : త్యాగానికి బక్రీద్ ప్రతీక అని, మనిషి త్యాగంతోనే ప్రశాంతమైన జీవనం సాగించగలడని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఆయన మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డితో కలిసి పట్టణంలోని పాత ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం వారు ముస్లింలకు ఈద్‌ముబారక్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. దైవం మానవుని దయ, త్యాగ గుణాల గురించి కఠినమైన పరీక్షలు పెడతారని, అందులో నెగ్గిన వారికి మంచి జీవితాన్ని ప్రసాదిస్తారన్నారు. వారినే మానవ లోకానికి అల్లాహ్ ఆదర్శంగా నిలుపుతారని తెలిపారు. మనిషి చెడుగుణాలను విడనాడినప్పుడే సన్మార్గం వైపు పయనించగలడని తెలిపారు. ప్రతి ఒక్కరూ త్యాగ గుణాన్ని అలవరుచుకోవాలని తెలిపారు. కాగా నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. అన్ని ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



ఈద్ ముబారక్ తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



చిన్నమండెంలో..



నందలూరు మండలం నాగిరెడ్డిపల్లిలో..



సిద్దవటం ఈద్గాలో..

గాయత్రీదేవికి ప్రత్యేక అలంకరణ

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం గాయత్రీదేవి జయంతిని పురస్కరించుకుని గాయత్రీమాతకు ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, మహా మంగళహారతిని అర్చకులు కార్తీక్‌స్వామి ఇచ్చి, తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

● స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం యోగభోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అలంకరణ చేసి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు మహమ్మారమ్మ జాతర

స్థానిక ఎస్‌బీఐ కాలనీలో వెలసిన మహమ్మారమ్మ జాతర మంగళ, బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్ ప్రసాద్‌బాబు తెలిపారు. కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు, పెద్దల సహకారంతో ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, దీలు, బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు. బుధవారం పగలు తిరుణాల అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు.



అయ్యప్పస్వామి ఆలయంలోని గాయత్రీమాత



ప్రత్యేక అలంకరణలో శ్రీ యోగభోగేశ్వరుడు

భూమి ఆక్రమణ



భూమిని చదును చేసిన దృశ్యం

చిన్నమండెం : మండల పరిధి వండాడి గ్రామ పంచాయతీలో కడప–బెంగళూరు జాతీయ రహదారి నుంచి దళితవాడ, గాండ్లపల్లెకు వెళ్లే రహదారి పక్కన ఉన్న విలువైన 4 ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆక్రమించుకుంటున్నాడని స్థానికులు తెలిపారు. సర్వే నంబర్ 140/3లో ఈ భూమి ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శీనునాయక్‌ను వివరణ కోరగా.. ఆ భూమిని గతంలో పీఓటీ చేశారని, అందులోనూ అది హైకోర్టు పరిధిలో ఉందని, దానిని ఆక్రమించుకుంటున్నాడని తమకు ఫిర్యాదు అందిందని తెలిపారు. ఆ భూమిని పరిశీలించి ఆక్రమించుకుంటున్న వారిపై కఠిన చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

శీతల గంగమ్మకు విశేష పూజలు

సిద్దవటం మండల పరిధి మాధవరం–1 గ్రామ పంచాయతీ పార్వతీపురం గ్రామంలోని శ్రీ శీతల గంగమ్మకు భక్తులు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. 21వ వార్షికోత్సవం సందర్భంగా తెల్లవారుజామున భక్తులు, గ్రామ ప్రజలు అమ్మవారి గుడిపై 101 బిందెలతో నీళ్లు పోశారు. అనంతరం అమ్మవారిని అలంకరించారు. అభిషేకం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, కుంకుమార్చన, హోమం వంటి పూజా కార్యక్రమాలను అర్చకులు చేశారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకొని, కాయా, కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ వారు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

– సిద్దవటం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా ధ్వజారోహణం



ఆలయం ముందు ధ్వజారోహణ కార్యక్రమం



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

పెనగలూరు (ఓబులవారిపల్లె): పెనగలూరులోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వడియరాజులు ఉభయదాతలుగా ఈ కార్యక్రమానికి వ్యవహరించారు. రాత్రి హరికథా కాలక్షేపం చేపట్టినట్లు ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్య, పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య తెలిపారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

నేడు శేషవాహనం : బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం నాయుడు సంఘం ఉభయదాతలుగా శేషవాహనం నిర్వహిస్తారు. వేణుగోపాలస్వామి సతీసమేతంగా శేషవాహనంపై ఊరేగనున్నట్లు వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిమ్మనపల్లె : గ్రామ పంచాయతీలలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే స్వీపర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ అరవింద్, జిల్లా కార్యదర్శి శోభ డిమాండ్ చేశారు. సోమవారం డివిజన్ స్థాయి సమావేశాన్ని నిమ్మనపల్లెలో ఏర్పాటు చేశారు. వివిధ ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, మధ్యాహ్న భోజన వర్కర్లు, స్వీపర్లుకు వెంటనే గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. వారిని పర్మనెంట్ చేయాలన్నారు. పెండింగ్‌లోని బకాయిలు వెంటనే చెల్లించాలని, హాజరు పట్టిక నిర్వహించాలని కోరారు. ఏడో పే కమిషన్ సిఫారసు మేరకు వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. ఈఎస్ఐతో కూడిన హెల్త్ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, జీవిత బీమా అమలు చేయాలని, విధుల నిర్వహణలో రక్షణ పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు.

దాన ధర్మాలు చేయాలి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండలంలోని పెనగలూరు, నాయుడువారిపల్లి, చక్రంపేట తదితర ప్రాంతాలలో సోమవారం బక్రీద్‌ను ఘనంగా జరుపుకొన్నారు. దానధర్మాలు చేయాలని మత పెద్దలు సూచించారు.